
జనం తెర మీద సినిమాను చూస్తున్నారు. బాలయ్య, మల్లేశం ముందు సీట్లో వున్న ముద్దుగుమ్మను చూస్తున్నారు.

హీరో విజృంభించి పాతికమంది ప్రత్యర్థులను చిత్తు చేస్తుంటే ఆమె సీట్లో సరిగా కూర్చోలేకపోతోంది.

వెకిలి హాస్యానికి, రెండర్థాల నాటు మాటలకీ ఆమె పగలబడి నవ్వుతోంది.

డ్యూయెట్లు వచ్చినప్పుడల్లా కళ్ళు పెద్దవి చేసుకుని రెప్ప వేయకుండా తదేకంగా చూస్తోంది.

ఆమె ఆనందాన్ని ఒంటరిగా అనుభవిస్తోంది తప్ప ఎవరితోనూ పంచుకోవడం లేదనే విషయాన్ని మిత్రులిద్దరూ పసికట్టారు. అలా పసికట్టే పాతికేళ్ళ వయస్సు వాళ్ళది. వాళ్ళు హాల్లోకి పిక్చరు ప్రారంభమయిన తర్వాత రావడం వల్ల ముందు కూర్చున్న అందాల బొమ్మ ఒంటరిదని తెలియలేదు. తెలిసిన తర్వాత అనుమానాన్ని నివృత్తి చేసుకొనే వరకూ వాళ్ళ ఆదుర్దా ఆగలేదు. బాలయ్య కాలు చాపి ఆమె పాదాన్ని తాకాడు. ఆమె ఉలిక్కిపడి వెనక్కి చూసింది. వాళ్ళ కళ్ళ ముందు మెరుపు మెరిసి అదృశ్యమైంది.




"సారీ, చూడలేదు" అన్నాడు బాలయ్య వినిపించీ వినిపించనంత నెమ్మదిగా.

ఆమె మాట్లాడలేదు. సినిమా చూడ్డంలో లీనమైంది. బాలయ్య వెంగు లాగాడు. మల్లేశం ఆమె మొహం మీదికి సిగరెట్టు పొగ ఊదాడు. అయినా ఆమెగాని, ఆమె తరపున పక్కవాళ్ళుగాని పోట్లాటకు రాకపోవడంతో ఆమె ఒంటరి పక్షి అని నిర్ధారణ అయింది. మరికొంత అడ్వాన్స్ అయివుండేవాళ్ళే కాని కూర్చున్నది మొదటి తరగతి కావడం వల్ల ఏ ఆఫీసరు కంటపడినా ప్రమాదమని ఇంటర్వెల్ వరకు ఓపిక పట్టారు.

హాల్లో లైట్లు వెలగ్గానే ఎదుటి సీట్లో శాల్తీ కేసి ఆత్రంగా చూసిన బాలయ్య, మల్లేశాల కళ్ళు జిగ్గుమన్నాయి. ఆ సీట్లో వున్నది పదిహేడు, పద్దెనిమిదేళ్ళ అమ్మాయి. డైటింగ్ చేసే కాలేజీ అమ్మాయిలా కాకుండా పుష్టిగా వుండడంవల్ల, ఆ పైన లంగా, ఓణీ వేసుకోవలసిన ఆ వయస్సులో చీర కట్టడం వల్ల చీకట్లో అంత తక్కువ వయసున్న అమ్మాయి అని పసిగట్టలేకపోయారు. కొత్త నీటితో గట్లు ఒరుసుకొని ప్రవహిస్తున్న గోదారిలా వున్న ఆమె అందాన్ని, పరువాన్ని చూడగానే వాళ్ళకు నోళ్ళూరాయి. లేచి ఒళ్ళు విరుచుకుంటున్న ఆమె లావణ్యానికే వాళ్ళ కళ్ళు చెదిరాయి.

హాలు బయటకు వెళ్తున్న ఆమెను వాళ్ళిద్దరూ అనుసరించారు. ఏ టీయో, సోడాయో తాగడానికి వెళ్తుందనుకొన్న వాళ్ళ అంచనాకు భిన్నంగా – ఆ

అమ్మాయి మేడ మెట్ల పక్కనే వున్న పూల మొక్కల దగ్గర గాలి కోసం నిలబడింది. మల్లేశాన్ని దూరంగా వుండమని సైగ చేసి బాలయ్య ఆమె దగ్గరగా వెళ్ళాడు.

"పేరేమిటి?"

"ఎందుకు?" ఆ అమ్మాయి మొహం తిప్పకుంది.

"అహ... ఎక్కడో చూసినట్టు వుంటేను."

"చినతల్లి."

"అలాగా - అయితే నేననుకొన్నది నువ్వు కాదులే. మరి ఒక్కదానివే వచ్చావే - అందులో సెకండ్ షోకి."

"ఆట అయిపోయే టైమ్‌కి మా అన్నయ్య వచ్చి తీసుకెళ్తాడు."

"మీ అన్నయ్యేం చేస్తాడు?"

"పాల యాపారం."

"మరి నీకలాంటి యాపారం ఏమీ లేదా?" బాలయ్య కళ్ళు కొంటెగా చూశాయి.


"మర్యాదగా మాట్లాడు."

"అంత కోపమెందుకు? నీ అందం ముందు హీరోయిన్ బలాదూరు. నువ్వు అవునంటే నా గదికి వెళ్దాం - మూడో కంటివాడికి తెలీదు" నసుగుతున్నాడు బాలయ్య. అతను దగ్గరగా వస్తున్న కొద్దీ బ్రాందీ వాసనకు చినతల్లి తల తిరుగుతోంది.

"నేనలాంటి దాన్ని కాదు. నువ్వు పిచ్చి పిచ్చిగా మాట్లాడితే గొడవవుతుంది జాగ్రత్త" విసవిసా నడిచి వెళ్ళిపోయింది చినతల్లి.

ఆమె హెచ్చరికకు కంగుతిన్న బాలయ్య ఓ క్షణం తర్వాత తేరుకొని వెళ్ళి మల్లేశం చెవిలో గుసగుసలాడాడు.

తిరిగి సినిమా ప్రారంభమయిన తర్వాత చినతల్లి ఓసారి వెనక్కి తిరిగి చూసింది. బాలయ్య సీటు ఖాళీగా వుంది. రెండోవాడు మాత్రమే సినిమా చూస్తున్నాడు. చినతల్లి మనసు భయంతో బరువెక్కిపోయింది. సినిమా అయ్యేవరకు వుంటే ఇంటర్వెల్‌లో మాట్లాడిన మనిషి ఏమైనా చేస్తాడేమో... వాడెందుకు వెళ్ళిపోయాడు? వాడి బారి నుంచి ఎలా తప్పించుకోవాలి?' ఆలోచనలు ఆమెను సినిమా చూడనివ్వడం లేదు. పక్కవాళ్ళతో



చెప్పకుందామన్నా వెనుక వున్నవాడు ఎటువంటి ఆగడం చేయడం లేదు. చినతల్లి గుండెలరచేత పట్టుకొని వస్తున్న దుఃఖాన్ని దిగమింగుకుంటూ యాంత్రికంగా తెర కేసి చూస్తోంది.

'నీ దిమ్మ తిరగెయ్యనా
నీ దుమ్ము దులిపెయ్యనా'

తెర మీది మసాలా పాట, దానికి తగ్గ హీరో హీరోయిన్ల మల్ల యుద్ధం లాంటి 'డ్యాన్స్' ప్రేక్షకులను మత్తెక్కిస్తున్నాయి. సరిగ్గా అదే సమయంలో తియ్యటి వాసన చినతల్లి నాసికా రంధ్రాలను సోకింది. తల మొద్దుబారిపోతున్నట్టుగా అనిపించింది. మరుక్షణం కుర్చీలో వాలిపోయింది.

* * *

రెండో ఆటకెళ్ళిన జనమంతా తిరిగి వచ్చేసినా చినతల్లి ఇంటికి రాకపోవడంతో రాజమ్మ మనస్సు కీడును శంకించింది.

అరగంట... గంట... కాలం పరుగెడ్తోంది. తలుపులు తీసుకొని కూర్చున్న రాజమ్మ ఏ అలికిడయినా, ఏ మాటలు వినిపించినా చినతల్లే అనుకొని ఎదురు చూస్తోంది.

'ఎంత పెద్ద ఆట అయినా ఇంత ఆలస్యమవదు. ఏదో జరిగుండాలి. మంగతో కలసి వెళ్తానంది. అది వచ్చిందో, లేదో' పది బారల దూరంలో వున్న మంగ ఇంటికి వెళ్ళి తలుపు కొట్టింది రాజమ్మ. నిద్ర కళ్ళతో తలుపు తీసిన మంగ "నన్ను రమ్మంది కానీ, నాకు కుదరక వెళ్ళలేదు" అని చెప్పేసి తలుపు వేసుకొంది.

'అయితే ఒక్కతే వెళ్ళిందన్న మాట... దీని సినిమా పిచ్చి పాడుగాను... వయసులో వున్న పిల్ల ఒక్కత్తెనే రెండో ఆటకు పంపించావని జనమంతా నాకు గడ్డి పెడతారు. అది ఇంతవరకూ రాలేదంటే ఏ అఘాయిత్యమో జరగలేదు కదా! పుట్టినరోజని పట్టుబడితే కాదనలేకపోయింది కానీ, లేకపోతే తను మాత్రం ఇంత మూర్ఖంగా పంపించి వుండేదా?'

పరిపరి విధాలుగా పరుగులు తీస్తోన్న ఆలోచనలతో ఇల్లు చేరిన రాజమ్మ - కూతురు ఈలోగా వచ్చిందేమోనని ఇల్లంతా వెతికింది - చినతల్లి జాడలేదు.

పగలంతా సైకిల్ తొక్కి తొక్కి ఆదమరచి నిద్రపోతున్న కొడుకు సంగయ్యను లేపింది. ఉలిక్కిపడి లేచిన సంగయ్య తల్లి కేసి ప్రశ్నార్థకంగా చూశాడు. చూపులూ, చేష్టలూ తప్ప మాటలకు నోచుకోని పుట్టు మూగ సంగయ్య.

రాజమ్మ చెప్తున్న మాటలు విని చినతల్లిని ఒంటరిగా సినిమాకు పంపినందుకు సంగయ్య తల్లి మీద కోప్పడ్డాడు. విసుక్కుంటూ సైకిలెక్కి మొదట సినిమా హాలు దగ్గర వెతికాడు. అతను వెళ్ళేసరికే సినిమా హాలు మూసేసి, లైట్లు తీసేశారు. అది పగటి పూట సావిలా, మన్మధుడు ఖాళీ చేసి పోయిన పాడుమేడలా వుంది. ఆ తర్వాత పల్లెలాంటి పట్నంలో తనకు అనుమానమున్న వీథులన్నీ గాలించాడు. సందు సందునా కనిపిస్తున్న సంగయ్యను అనుమానించి నైట్ డ్యూటీ చేస్తున్న కానిస్టేబుల్ నిలేశాడు. సంగయ్య సంజ్ఞలు అర్థంకాక విసుక్కుని వెళ్ళిపొమ్మన్నాడు కానిస్టేబులు.

గంట గంటన్నర తర్వాత ఇంటికి తిరిగి వచ్చిన సంగడేమైనా మంచి సమాచారం అందిస్తాడేమోనని ఎదురుచూసిన రాజమ్మ, ఈలోగా చినతల్లి తిరిగి వచ్చుండొచ్చని ఆశించిన సంగయ్య - ఇద్దరూ నీరు కారిపోయారు.

"ఎవరో తీసుకెళ్ళిపోయారు. కొంప మునిగిపోయింది నాయనో" సన్నగా రాగాలు పెట్టింది రాజమ్మ. సంగయ్య తల్లిని నోరు మూసుకోమన్నట్లు ధుమధుమలాడాడు.

రాజమ్మ గుడ్ల నీరు కుక్కుకొంటూ ద్వారబంధానికి చేరబడిపోయింది. కళ్ళలో వత్తులు వేసుకొని తెల్లవార్లూ చినతల్లి తిరిగి వస్తుందనే ఆశతో ఎదురుచూస్తూనే వుంది.


కాకులు కావుకావుమనే వేళకి చినతల్లిని ఎవరో 'కిడ్నాప్' చేసి తీసుకుపోయారనే వార్త ఆ వీథంతా పాకిపోయింది.

తెలిసినవాళ్ళు పరామర్శిద్దామని రాజమ్మ ఇంటికి వెళ్ళేసరికి అరుగులు తుడుస్తున్న చినతల్లి వాళ్ళ కంట బడింది.

'నీలి వార్తలంటే ఇలాగే వుంటాయి' అని వాళ్ళు ముక్కున వేలేసుకుని పోయారు.

* * *

తలుపులు దగ్గరగా వేసింది రాజమ్మ.



సంగయ్య కళ్ళు నిప్పులు చెరుగుతున్నాయి. వినతల్లి గోడకు చేరబడి వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"ఇక ఆ ఏడుపు కట్టిపెట్టి ఏం జరిగిందో చెప్పు. ఎదిగిన పిల్ల తెల్లవార్లూ ఎక్కడో వుందంటే ఎంత అప్రతిష్ఠ... అవ్వ... అవ్వ..."

బాలయ్య, మల్లేశం తన వెనుక చేరి అల్లరి చేయడంతో ప్రారంభించి, స్పృహ తప్పే వరకు జరిగిన సంగతి వివరించింది వినతల్లి. అది విని ఆవేశపడుతున్న సంగయ్యను రాజమ్మ అనునయించింది.

"నువ్వూరుకోరా. ముందు అదేం చెప్తుందో విను."

"నాకు తెలివి తప్పిన తర్వాత ఏం జరిగిందో నాకు తెలియలేదు. స్పృహ వచ్చేసరికి ఒక కారులో వున్నాను. భయంతో గట్టిగా అరిచాను. నా పక్కనే కూర్చున్న నీ వయసున్న ఆమె నాకు ధైర్యం చెప్పింది. కారులో నేను, ఆవిడ, ఆవిడ భర్త, ఆరేళ్ళ మనవడు, కారు డ్రైవరు వున్నాం. నేను కారులోకి ఎలా వచ్చానని అడిగాను. నన్ను ఇద్దరురౌడీలు టాక్సీలో ఎక్కించుకొనిపోతుంటే అనుమానించి పెద్దాయన ఆ టాక్సీ వెనుకే కారును పోనిచ్చి వాళ్ళను పట్టుకోమన్నారట. కొంత దూరం పోయిన తర్వాత వాళ్ళు దొరికిపోతామనే భయంతో స్పృహలేని నన్ను రోడ్డు మీద పడేసి వెళ్ళిపోయారట. తెలివి వచ్చిన తర్వాత నా సంగతి తెలుసుకొని పంపించవచ్చని పెద్దాయన నన్ను కారులో ఎక్కించమన్నారట... వాళ్లేమో వాళ్ళబ్బాయికి స్కూటర్ యాక్సిడెంట్ అయి సీరియస్‌గా వుందని ఫోనొస్తే రాజమండ్రి వెళ్తున్నారట. అందువల్ల వాళ్ళు కూడా మరేమీ మాట్లాడే స్థితిలో లేరు."

"ఆ పుణ్యాత్ముడే అడ్డుపడకపోతే నీ గతి ఏమయ్యేదో. ఇంతకీ వాళ్ళబ్బాయికి ఎలా వుందో పాపం?"

"మేం వెళ్ళేసరికే అతను పోయాడు. వాళ్ళ పరిస్థితి చూసి గుండె చెరువైపోయింది. మీరు కంగారు పడుతుంటారని తెల్లవారుతుండగానే ఆ పెద్దాయనకు నమస్కారం చేసి ఆయనిచ్చిన పది రూపాయిలతోనే బస్సెక్కి వచ్చాను."

"వర్మం ఒలిచి చెప్పులు కుట్టించినా ఆ మారాజు ఋణం తీర్చుకోలేం. ఇంతకీ ఆయన పేరు, ఊరు కనుక్కున్నావా?"


"మాటల్ని బట్టి పేరు మాత్రం పెరుమాళ్ళుగారని తెలిసింది. అంత కష్టంలో వున్న వాళ్ళని ఇంకేమి అడిగినా బాగుండదు కదా! వాళ్ళు కూడా నా అడ్రస్ అదీ తెలుసుకోలేదు. పెరుమాళ్ళుగారి భార్య మాత్రం 'అలా ఒంటరిగా సినిమాకి బయల్దేరావా' అని జాలి పడ్డారు."

"నిజం చెప్పవే! ఆ రౌడీ వెధవలు కారులో ఎక్కించుకొని తీసుకువెళ్తుండగా ఏమీ జరగలేదు కదా?"

"ఊహు!"

"అదే వాళ్ళు నిన్నేమీ పాడుచెయ్యలేదు కదా?"

అంతవరకు బిగబట్టిన కన్నీళ్ళు వినతల్లి కళ్ళ వెంట ధారలుగా ప్రవహించాయి. రాజమ్మ ఆత్రుత ఎక్కువైంది.




"ఏమే? ఏమైనా చేశారా?"

"నేను తెలివిలో లేను కదా తెలియడానికి! నాకు తెలిసినంతవరకూ అలాంటి అఘాయిత్యం ఏదీ జరగలేదు. పెరుమాళ్ళుగారి భార్య కూడా అదే అన్నారు."

"సరే..జరిగిన సంగతి ఎవరికీ చెప్పకు. ఎవరడిగినా రాత్రి ఇంట్లోనే వున్నానని చెప్పు" కూతుర్ని అక్కున చేర్చుకొని కన్నీళ్ళు తుడిచింది.

పోలీస్ స్టేషన్‌కి ఫిర్యాదు చేస్తానని సంజ్ఞ చేశాడు సంగయ్య.

"వాల్లేరా. తెలివితక్కువ నాగన్నా. పోలీస్ టేసనుకి యెళ్ళడం కంటే పులి బోనులో తలెట్టడం మంచిది. అయినా నా బిడ్డకేం జరిగిందని" అంటూ సంగయ్యను కసిరింది రాజమ్మ.


*   *   *

"గుడ్మార్నింగ్ సర్!"

"రండి చారిగారూ, ప్లీజ్ బి సీటెడ్. ఏమిటి విశేషాలు?" టేబుల్ మీద పెట్టిన టోపీని అలవాటుగా అటూ, ఇటూ కదుపుతూ అడిగాడు ఎస్.ఐ. సాయిబాబా.

"విశేషాలు మీరే చెప్పాలి. నేను చెప్పిన కేసు ఏమైంది?"

"తల్లినీ, కూతుర్నీ కూడా స్టేషన్‌కి పిలిపించాను. వాళ్ళు నిజం చెపితే పరువుపోతుందని భయపడుతున్నారు. రాత్రి సినిమాకి వెళ్ళిన మాట నిజమే కాని ఆపైన ఏమీ జరగలేదంటున్నారు."




"మరి వాళ్ళన్నయ్య ఆ అమ్మాయిని వెతుకుతూ కనిపించాడని మీ కానిస్టేబులు చెబుతున్నాడుగా?"

"మధ్యలో ఎవరితోనో మాట్లాడుతుంటే ఆలస్యమయిందట. ఈలోగా వాళ్ళన్నయ్య కంగారుపడి వెతికాడట.

అందువల్లే పుకారు వచ్చిందట. వెధవ నాలుక వుంది చూశారా! బోనులో సాక్షి లాంటిది. ఎలా పలకమంటే అలా పలుకుతుంది. వాళ్లకి లేని బాధ మనకెందుకని రెండు తిట్టి పంపించేశాను?!"

"అయితే ఈ కేసునింకమీరు పర్‌స్యూ చెయ్యరా?"

"ఎవరూ రిపోర్ట్ ఇవ్వందే మేమేం చెయ్యగలం? మా లిమిటేషన్స్ మాకుంటాయి!"

"ముద్దాయిల్ని మీరు పట్టుకోకపోతే రేపు వెలరేగి రోజుకో మానభంగం చేస్తారు!"

"ఇది అడివి కాదు చారిగారూ - సమాజం. దోషులు ఎప్పటికైనా దొరక్కపోరు!"

"వాళ్ళు దొరికే లోగా ఎంతమంది బలవుతారో కూడా మీరు ఆలోచించాలి. ఊరు ఊరంతా గుప్పుమంటే కంప్లయింట్ రాలేదనే సాకుతో మీరు పట్టించుకోకపోవడం సబబు కాదు!"

"అయ్యో, చారిగారూ - ఇలాంటి సెన్సేషనల్ న్యూస్ రాస్తే మా 'తెలుగు వెలుగు' పత్రిక వారు మీకిచ్చే ఎవార్డు నేనైనా ఇస్తాను కాని నిజా నిజాలు పూర్తిగా తెలీకుండా న్యూస్ రాసి మా పీకల మీదకు తీసుకురాకండి!"

"మీలాంటి సమర్థులైన పోలీసు ఆఫీసరు ఇలా మాట్లాడతారనుకోలేదు. పోనీ ఓ పని చేద్దాం. నాకు తెలిసిన వార్తను మా పత్రికలో రాసి ఎన్ని ఫీలర్ వేస్తాను. దాని మీద ఎలాంటి రెస్పాన్స్ వస్తుందో చూద్దాం!"

"సరే రాయండి"

మూడో రోజు పేరు మాత్రం మినహాయించి 'మరో మాన భంగం' పేరుతో వినతల్లి వార్త 'తెలుగు వెలుగు' దినపత్రికలో బాక్సు కట్టి ప్రచురించారు. ఆ తర్వాత ఒకటి, రెండు రోజుల్లో మిగతా పత్రికల్లో కూడా మరికొన్ని ఊహాగానాలతో అచ్చయిందా వార్త.

*   *   *   *

రెణ్ణెల్లు తిరక్కుండా మళ్ళీ ఆ వీధిలో జనం చెవులు కొరుక్కున్నారు.

వినతల్లికి కడుపులో నెప్పొచ్చి డాక్టర్ దమయంతి దగ్గరకు తీసుకు వెడితే ఆవిడ పరీక్షించి అమ్మాయి నెల తప్పిందని చెప్పిందట! రాజమ్మ గుండెలు బాదుకుని ఆ అమ్మాయికి గర్భస్రావం చేయించడానికి ప్రయత్నిస్తోందట!

ఆ వీధిలోనే వుంటున్న 'తెలుగు వెలుగు' విలేకరి వారికి భార్య ద్వారా ఈ వార్త తెలిసింది. వార్త తెలిసిన క్షణం వారి స్టేషన్‌కి ఫోన్‌చేసి ఎస్.ఐ.తో తనో ముఖ్యమైన విషయం మాట్లాడడానికి వస్తున్నట్టు చెప్పాడు.


ఎస్.ఐ. సాయిబాబా వారి చెప్పిన విషయం విని ఆశ్చర్యపోయాడు. డాక్టర్ దమయంతికి ఫోన్ చేశాడు.

"నమస్తే మేడమ్. ఇన్‌స్పెక్టర్ సాయిబాబాను మాట్లాడుతున్నాను... ఉదయం వినతల్లి అనే అమ్మాయిని మీ దగ్గరకు ట్రీట్‌మెంట్ కోసం తీసుకొచ్చారా?"

"అవును. ఆ అమ్మాయికేమయింది?" దమయంతి స్వరంలో ఆదుర్దా.

"మీరేం వర్రీ కావలసిన అవసరం లేదు. ఆ అమ్మాయి కంప్లైంట్ ఏమిటో తెలుసుకుందామని"

"కడుపు నొప్పి అని తీసుకు వచ్చారు. షి ఈజ్ క్యారీయింగ్!"




"ఆ అమ్మాయికి పెళ్లి కాలేదు! మీకు తెల్సా?"

"వాళ్లమ్మ చెప్పింది. ఈ రోజుల్లో ఇదేం విశేషం కాదుగా?"

"మరి మీరేం సలహా ఇచ్చారు?"

"అబార్షన్ చేయించమని!"

"కానీ తొందరపడి మీరు కేసు టేకప్ చేయకండి. ఆ అమ్మాయిది రేప్ కేసు. మేం ఎంక్వైరీ చేస్తున్నాం"

"థాంక్యూ. ముందుగా చెప్పి కోర్టుల చుట్టూ తిరగవలసిన అవసరం లేకుండా రక్షించారు!"

"ఇన్ఫర్మేషన్ ఇచ్చినందుకు మీకూ థాంక్స్. ఉంటానండీ. మరి సెలవు" రిసీవర్ పెట్టేశాడు సాయిబాబా.

"ఇప్పుడేమంటారు ఇన్‌స్పెక్టర్‌గారూ. దమయంతి గారి డయాగ్నోసిస్ మీదైనా మీకు నమ్మకముందా?"

"భలేవారే. ఊళ్లో రోరింగ్ ప్రాక్టీస్ వున్నది ఆమెకే కదండీ. మీరు చెపితే నమ్మరు చారిగారూ. పేపర్లో వార్తలు వచ్చిన తర్వాత వాళ్లమ్మ వచ్చి యేడ్చేసింది. కూతురికి పెళ్లికాదని నెత్తి నోరూ కొట్టుకుంది. ఆ అమ్మాయి నిప్పులాంటిదని ప్రగల్భాలు పలికింది. నాకు తెలియదు - ఆ కరస్పాండెంట్ల నడగమని చెప్పి పంపేశాను. మరిప్పుడేముంటుందో చూడాలి!"

"కబురు పంపి ఇప్పుడైనా రిపోర్ట్ ఇమ్మనండి!"

"సాయంత్రం కబురు పంపి - జరిగింది జరిగినట్లు చెప్పకపోతే తోలు తీసేస్తాను. ఈ కేసు వెలుగులోకి తీసుకొచ్చిన క్రెడిట్ మీదే. మేము కూడా మనుషులమే కదా! మీలాంటివారు సహకరిస్తే మేం ఏదైనా చేయగలం!"

"థాంక్యూ. వస్తానండి. రెణ్ణెల్ల క్రితం రాసిన న్యూస్‌కి 'ఫాలో అప్' ఇస్తాను".

"అలాగే! రేపు కనిపించండి. ఈ కేసుకు సంబంధించిన మరికొన్ని వివరాలు చెప్తాను."

"ఓ.కే.సర్. సీయూ" మిగతా పత్రికల వారి




కంటే ముందుగా ఆ వార్త రాయాలనే ఆత్రుతతో వారి సైకిలెక్కాడు.

*    *    *    *

కానిస్టేబుల్ వచ్చి రాజమ్మనీ, చిన తల్లినీ వున్న వాళ్లని వున్నట్టుగా బయల్దేరి రమ్మని చెప్పగానే రాజమ్మ గుండె ఝల్లుమంది. డాక్టరమ్మ చెప్పిన వార్త విని మంచానికి బల్లిలా కరచుకుపోయిన చినతల్లిని బయటకు తీసుకురాలేక-రాజమ్మ ఒక్కతే స్టేషన్‌కి వెళ్లింది. ఎస్.ఐ.కి నమస్కరించి తల వంచుకుని నిల్చుంది.

''ఏం రాజమ్మా? మీ అమ్మాయి రాలేదేం''?

''దానికి ఒంట్లో బాగుండలేదండీ''

''అంటే'' ఎస్.ఐ. కళ్లల్లో అవహేళన.

''అదే బాబూ నలతగా వుందండి!''

''మరి డాక్టర్‌గారికి చూపించావా?''

అవునన్నట్టు తలూపింది రాజమ్మ.

''ఏమన్నారు?''

''మాకేం చెప్పలేదండి. ఏవో మందులు రాసిచ్చారు!''

''హోర్మయ్...ఉం...కానా... అబద్ధాలు చెప్పావంటే బూటు కాలితో తంతాను. ఇది వరకు ఇలాగే చెప్పావ్. నీ కూతురు ఏమీ తెలియని పాప అన్నావు. ఇప్పుడు కూడా డాక్టరమ్మ చెప్పిన విషయం దాచేస్తున్నావ్. నిజం చెప్పు. నీ కూతురికి కడుపేనా?''

''ఏమోనండి. డాక్టరమ్మగారు అలాగంటున్నారండి. అది అలాంటిది కాదండీ!''


''అలాంటిది కాకపోతే నీ కూతురు 'మేరీ మాత' అంతటి పవిత్ర మూర్తి అంటావా? పోనీ ఇది చెప్పు. రెణ్ణెల్ల క్రితం నిన్ను పోలీస్ స్టేషన్‌కి పిలిపించిన తర్వాత మీ అమ్మాయి బయటుందా?''

సిగ్గుతో, భయంతో తలపడాయిస్తోంది రాజమ్మ.

''ఏం. మాట్లాడవు? చెప్తావా? సచ్చే పిరికోలా తన్నమంటావా?'' ఇన్‌స్పెక్టర్ కళ్లవెంట నిప్పులు కురుస్తున్నాయి.

''లేదండీ''-అతి కష్టం మీద చెప్పగలిగింది రాజమ్మ.

''మరి ఈడొచ్చిన ఆడపిల్ల బయటుండడం లేదంటే దాన్ని కడుపు కాక మరేమంటారే గుడిసేటి ముం... ఇప్పుడు చెప్పు. ఆ రాత్రి సినిమాకు వెళ్లిన మీ అమ్మాయిని ఎవరో మత్తు మందు పెట్టి తీసుకుపోయారు! అవునా?''




''అవునటండి'' – ఆపాదమస్తకం వణికిపోతోంది రాజమ్మ.

''తీసుకువెళ్లి ఏం చేశారు?''చేతిలో వున్న స్టిక్‌తో బెదిరించాడు సాయిబాబు. రాజమ్మ తనకు చినతల్లి చెప్పిన వృత్తాంతాన్ని గుర్తున్నట్టు చెప్పింది.

''ఈ కథ ఎవరైనా సినిమా వాళ్లకి చెప్పు, పని కొస్తుంది! టాక్సీలో తీసుకెళ్లిన రౌడీలు తిరగబడకుండా పెరుమాళ్లుగారికి భయపడి మీ అమ్మాయిని వదిలేసి పారిపోయారా? ఆ పెరుమాళ్లుగారు ఎవరో తెలియదా? ఆయనొచ్చి అప్పగించడానికి వీల్లేకుండా కొడుకు చని పోయాడా? పోనీ నమ్ముదాం. నీ కూతురికి కడుపెలా వచ్చింది మరి?''

''ఏమోనండీ! అది ఎలాంటి చెడ్డ పని జరగలేదంది. 'ఒంటిమీద తెలివి లేనప్పుడు కారులో ఏమైనా చేసారేమో' అని ఇప్పుడంటోంది?!''

''ఏం జరిగిందో మేమే తెలుసుకునే వాళ్లం ఈ కథ ముందుగా చెప్పి ఏడిస్తే. రాజమండ్రిలో స్కూటర్ ఏక్సిడెంట్ అయి చనిపోయిన కుర్రాడి తండ్రి పెరుమాళ్లు అంటున్నావు కదా! ఇప్పుడైనా మించిపోయింది లేదు. ఎంక్వైరీ చేస్తాం. నువ్వు జరిగింది యథాతథంగా రైటర్‌కి చెప్పి సంతకం చేసి వెళ్లు!''

''సంతకం సరిగా రాదండి!''

''నీ సంతకాన్ని చూసి ఎవరూ ఉద్యోగమివ్వరులే. వచ్చినట్టు పెట్టు. ఏమైనా విషయాలు దాచావంటే మాత్రం నీ కీలుకా కీలు తీసేస్తాను. జాగ్రత్త...ఊ... వెళ్లు!''

రాజమ్మను కానిస్టేబుల్ కూడా రైటర్ దగ్గరకు పంపించి రిపోర్ట్ రాయించమన్నాడు సాయిబాబా.

చీకటి పడే వేళకు పోలీస్ స్టేషన్ నుంచి బయట పడిన రాజమ్మ మనస్సు వికలమై పోయింది. ఇంత అప్రతిష్ట తీసుకొచ్చిన కూతుర్ని చంపడమో, తాను చావడమో ఏదో ఒకటి తేలాలనుకొంది. ఆవేశంగా ఇల్లు చేరిన రాజమ్మ చినతల్లి పడుకున్న గది తలుపులు తోసింది. అంతే — ఆ దృశ్యాన్ని చూసి ఒక్క కేకతో కుప్పకూలి పోయింది.

దూలానికి ఉరి పోసుకుని వేలాడుతోంది చినతల్లి.

*    *    *    *

రాజమ్మ ఎంత ప్రాధేయపడినా వినకుండా పోలీసులు చినతల్లి శవాన్ని పోస్టుమార్టంకి తరలించక మానలేదు.

ప్రభుత్వాస్పత్రిలో ఆమె శవం ముక్కలు ముక్కలు కాక తప్పలేదు.

పోస్టుమార్టం రిపోర్టు కోసం పత్రికా విలేకరులు, పోలీసు అధికారులు, ముక్కలైన శవాన్ని తెచ్చుకోడానికి సంగయ్య హాస్పిటల్‌కి వెళ్లారు.

కొన్ని నిమిషాల డాక్టర్ల గుసగుసల తర్వాత సర్జను చెప్పిన నిజాన్ని విని సాయిబాబా, వారి అదిరిపడ్డారు.

చినతల్లి గర్భవతి కాదట! ఆమె కడుపులో నాలుగు కేజీల కంతి పెరిగిందట!

నిజం తెలిసిన సంగయ్య మనసులో డైనమైట్లు పేలాయి. 'కసి' లావాలా రగులుతోంది. కళ్లు రుధిరాన్ని కక్కుతున్నాయి.

'చినతల్లిది ఆత్మహత్య కాదనీ,' మేధావులు అనాలోచితంగా చేసిన హత్య' అని అరవాలనుంది.

'ఇది నిర్భాగ్యుల జీవితాలతో చెంగాటమాడుతున్న లైసెన్స్‌డ్ మర్డరర్స్ పని'-ఘోషించాలని వుంది. ఇక్కడ ఆడది అర్ధరాత్రి సురక్షితంగా తిరిగొచ్చినా నమ్మరని, ఈ దేశానికి స్వాతంత్ర్యం రాలేదనీ ఎలుగెత్తి చాటాలని వుంది.

కానీ అతను నోరు విప్పలేదు!

కాగితం మీద కలం పెట్టలేదు!!

డబ్బుతో న్యాయాన్ని కొనుక్కోలేడు!!!

